క్లుప్తంగా

శ్రీముఖలింగంలో భక్తులు తాకిడి



స్వామివారి సన్నిధిలో భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో నాగులచవితి సందర్భంగా శుక్రవారం భక్తులు తాకిడి పెరిగింది. కార్తీక మాసంలో అధికంగా శివాలయాలకు రావడం పరిపాటే అయినా నాగుల చవితిని పురస్కరించుకుని భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి భీమేశ్వర, సోమేశ్వర ఆలయాలను దర్శించుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యం

జలుమూరు: అర్హతగల వారందరికీ ఓటు హక్కు కల్పించనున్నామని తహసీల్దార్ బి.సత్యం అన్నారు. ఓటు అతి పవిత్రమైనదని చెప్పారు. జలుమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, చల్లవానిపేటలోని విజ్ఞానదుర్గ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన కల్పించి మాట్లాడారు. అర్హత ఉన్న అందరూ ఓటరుగా చేరాలన్నారు. ప్రిన్సిపాళ్లు డి.వేణుగోపాలరావు, జి.మోహనరావు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న వెంకటరావు

సారవకోట: రబీ సీజన్లో రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని నరసన్నపేట వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి, ఏవో వెంకటరావు సూచించారు. బుడితి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా సంఘ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఏడాది వంశధారలో నీటి శాతం తక్కువగా ఉన్నందున రైతులు రబీలో వరికి బదులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. అలాగే త్వరలో ప్రారంభించనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ నక్క తులసీదాస్, వీఏఏలు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు బుట్టలు పంపిణీ



బుట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలువురు గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లకు చెత్తబుట్టలను శుక్రవారం పంపిణీ చేశారు. జగనన్న స్వచ్ఛసంకల్పంతో రాష్ట్రం క్లీన్ ఆంధ్రప్రదేశ్ కావాలని అన్నారు. మండల విస్తరణ అధికారి తారకేశ్వరి, మండల పరిపాలన అధికారి తిరుపతి పట్నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్ ఉన్నారు.

కొత్తూరులో 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కొత్తూరు: కొత్తూరు మండలంలో 17 ఆర్‌బీకేల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు ఏవో ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. కొత్తూరు, పారాపురం, ఓండ్రుజోల, సిరుసువాడ, వసప, నివగాం, కుద్దిగాం, పొనుటూరు, గురండి, సోమరాజపురం, దిమిలి, కురిగాం, లబ్బ, నేరడి, బలద, బమ్మిడి, మెట్టూరు బిట్-3 ఆర్‌బీకేలవద్ద కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు గుర్తించినట్లు చెప్పారు. కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకెళ్లి మద్దతు ధరను పొందాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నరసన్నపేట: నరసన్నపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు ఆదివారం చేపట్టనున్నారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలో ఆ రోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్ ఈఈ జి.శంకరరావు శుక్రవారం తెలిపారు. నరసన్నపేట, సత్యవరం, తామరాపల్లి, జమ్ము, బొరిగివలస, కంబకాయ, కరగాం, గొట్టిపల్లి, దూకులపాడు, చల్లబంద, చీడీవలస, జిల్లోడువలస, జడూరు, పిరివాడ, యాట్ల బసివలసల గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



పోలాకి: మబగాంలో నాగుల చవితి పూజల్లోపాల్గొన్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నాగుల చవితిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. కుటుంబ సమేతంగా పొలాల వద్దకు వెళ్లి పుట్టలను శుభ్రం చేసి, పువ్వులతో అలంకరించారు. నువ్వులతో చేసిన చిమ్మి, చలివిడి తదితర ప్రసాదాలు, కోడిగుడ్లు, పాలును పుట్టలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. రైతు కుటుంబాలంతా కలిసి వెళ్లి పూజలు చేసి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని నాగదేవతను వేడుకున్నారు. వేడుకల్లో రాజకీయ నాయకులు కూడా భాగస్వాములయ్యారు.



కొత్తూరు: కుటుంబ సభ్యులతో కలిసి నాగదేవతకు మొక్కుతున్న దృశ్యం



జలుమూరు: చిన్నదుగాంలో నాగమానస దేవాలయంలో భక్తుల పూజలు



నరసన్నపేట: జమ్ములో కుటుంబ సమేతంగా పుట్ట వద్ద పూజలు చేస్తూ..



సారవకోటలో పుట్ట దగ్గర పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు



ఆమదాలవలస రూరల్: శ్రీహరిపురంలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు



హిరమండలంలో నాగదేవతకు భక్తుల పూజలు



ఆమదాలవలస: కృష్ణపురం సమీపంలో పుట్టవద్ద పూజలు చేస్తూ పాలుపోస్తున్న భక్తులు



బూర్జ: లక్కుపురంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న ఎంపీపీ కర్నేన దీప కుటుంబసభ్యులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో పుట్టవద్ద భక్తుల సందడి



పాతపట్నం: పాతపట్నంలోని నీలమణిదుర్గ ఆలయం ఆవరణలోని పుట్టకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఇంటింటికీ సంక్షేమం చేరువ



కొత్తకోటలో సంక్షేమాన్ని వివరిస్తున్న స్పీకర్ సీతారాం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: వివక్షతకు తావులేకుండా ప్రతీ గడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కొత్తకోట, నక్కలపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత, సంక్షేమం, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు చెప్పిన సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడం చారిత్రాత్మకమని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు , వైస్ ఎంపీపీ జి.వి.శివానంద మూర్తి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు సురవరపు సింహాచలం, నాయకులు గండివలస ఉపేంద్ర, బొడ్డేపల్లి హరి, బద్రి రామారావు, ఎంపీడీవో పీవీ మురళీ మోహన్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఉన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం వర్తింపు

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- పెద్దలోగిడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకువర్తింపజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. పెద్దలోగిడి గ్రామంలో శుక్రవారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇప్పటి వరకు ఆయా కుటుంబ సభ్యులు పథకాల ద్వారా పొందిన ఆర్థిక ప్రయోజనాలను తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతిఒక్కరూ గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో కూడా అండగా నిలవాలని కోరారు. అడ్డదారుల్లో అధికారం పొందేందుకు ప్రజలకు మాయ మాటలు చెప్పేందుకు గ్రామాలకు వస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయంత్ ప్రసాద్, ఈవోపీఆర్డీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, మండల సచివాలయ కన్వీనర్ సూర్యం, నాయకులు గేదెల సూర్యం, పనుకు మోహన్, తూలుగు ప్రవీన్, కె.లక్ష్మీనారాయణ, అప్పలరాజు, జగన్, హరి, ఎంపీటీసీ సభ్యుడు జోగారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ మంచినీటిని సరఫరా చేస్తామని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా మండలంలోని పెద్దలోగిడిలో రూ.41.6 లక్షలతో చేపట్టనున్న ట్యాంకు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు ఇంటింటికీ స్వచ్ఛమైన మంచినీరు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదనరావు, జేఈ కల్యాణ్‌రామ్, ఎంపీడీవో జయంత్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ సూర్యం, ఎంపీటీసీ సభ్యుడు దువ్వాడ జోగారావు, హరి, జగన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు రుగడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

హిరమండలం: రుగడ సచివాలయం పరిధిలో శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డిశాంతి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్‌లు శుక్రవారం తెలిపారు. సచివాలయ పరిధిలోని రుగడ, కొమనాపల్లి, అవలంగి పంచాయతీల్లోని అన్ని గడపలను సందర్శించి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

నరసన్నపేట: యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడుగా టేకి సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రోణంకి బాబూరావు, బి.వి శాలాక్షి, ప్రధాన కార్యదర్శిగా కుంచి ఆదినారాయణ, కోశాధికారిగా పూతి కృష్ణారావు నియమితులయ్యారు. ఎన్నికల అధికారిగా బమ్మిడి శ్రీరామమూర్తి వ్యవహరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పొందూరు అప్పారావు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలు బలోపేతం

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళా రైతు ఉత్పత్తి సంఘాల ను బలోపేతం చేస్తున్నట్లు సంబంధిత సంఘాల (వెలుగు) ఏపీఎం ఎ.హరికృష్ణ చెప్పారు. ఎచ్చెర్లలో ని వెలుగు కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. సంఘాలు అర్హత బట్టి ఏడు సంఘా లకు రూ. 4.10 లక్షలు రుణం మంజూరు చేసినట్లు చెప్పారు. స్వయం సహాయ సంఘాల తరహాలో మహిళా రైతు సంఘాలను కూడా బలోపేతం చేస్తామన్నారు. వెలుగు ఏపీఎం ఆర్.రామ్మూర్తి ఉన్నారు.

ఓటర్ల దరఖాస్తులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఈఆర్‌వో వెంకట్రామన్

హిరమండలం: ఓటర్ల జాబితాకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నియోజకవర్గ ఈఆర్‌వో, జెడ్పీ సీఈవో ఆర్. వెంకట్రామన్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీఎల్‌వోలతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదు, ఓటు చేర్పు, తొలగింపు, సవరణలపై అభ్యంతరాలు ఉంటే.. వాటిని తక్షమే పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటు కోసం కొత్తగా వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హులకు ఓటు హక్కు కల్పించేలా చూడాలన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు సవరణలపై దృష్టి పెట్టాలన్నారు. తుది జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ బి.మురళీమోహన్, ఉప తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో బి.శైలజ ఉన్నారు.

సందడిగా గ్రంథాలయ వారోత్సవాలు

- గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమార్‌రాజు



నరసన్నపేట: క్విజ్ పోటీలను పరిశీలిస్తున్న కుమార్‌రాజు



సారవకోట: వ్యాసరచన పోటీలో విద్యార్థులు



కొత్తూరు: పోటీలో విద్యార్థులు



హిరమండలం: ఆటల పోటీలో చిన్నారులు



పాతపట్నం: గ్రంథాలయ పితామహుడు రమణయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా శాఖా గ్రంథాలయాల్లో సందడిగా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి బి.కుమార్‌రాజు తెలిపారు. నరసన్నపేట శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలను పరిశీలించారు. వారోత్సవాల నిర్వహణపై ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా బాగా జరుగుతున్నాయని అన్నారు. కాగా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వీటిని నిర్వహించినట్లు లైబ్రేరియన్ చాయ్ రతన్ తెలిపారు. పోటీలకు 30 మంది విద్యార్థులు పాల్గొనగా.. ఉపాధ్యాయుడు బాబూరావు న్యాయనిర్ణేతగా వ్యవహరించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు వారోత్సవాలు చివరి రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

చిత్రలేఖన పోటీలు

సారవకోట: మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విశ్రాంతి ఉపాధ్యాయుడు బోయిన వాసుదేవరావు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించినట్లు లైబ్రేరియన్ సాయమ్మ తెలిపారు.

వ్యాసరచన పోటీలు..

కొత్తూరు: స్థానిక గ్రంథాలయంలో.. గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి తెంబూరి ఇందిర పర్యవేక్షించారు.

ఆటల పోటీలు..

హిరమండలం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి కె.ఎర్రమ్మ మ్యూజికల్‌చైర్, రుమాల్‌చోర్, స్కిప్పింగ్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు.

సద్వినియోగం చేసుకోవాలి

పాతపట్నం: పుస్తకపఠనంతో జ్ఞానోదయం కలుగుతుందని ఎంఈవో బి.శ్రీధర్ అన్నారు. గ్రంథాలయాధికారి కాళ్ల రాజు అధ్యక్షతన పలువురు వ్యక్తులు గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు చిత్రపటాలకు ఎంఈవో-2 సీహెచ్ తిరుమలరావు, హెచ్ఎం వైకుంఠరావు, బ్యాంకు రిటైర్డు మేనేజర్ బాబూరావు, పీడీ ఎన్ని శేఖర్‌బాబు పూలదండలు వేశారు.

రైల్వేస్టేషన్‌లో నేరగాళ్ల ఫొటోలు



రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన నేరగాళ్ల ఫొటోలతో ఉన్న బోర్డుల వద్ద పోలీసు సిబ్బంది

ఆమదాలవలస: తరచూ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తుల ఫొటోలు, వారి వివరాలను ఆమదాలవలస రైల్వే స్టేషన్ వెలుపలి ప్రాంగణంలో శుక్రవారం ప్రదర్శనగా ఉంచినట్లు ఆమదాలవలస ఎస్సై రఘునాథరావు తెలిపారు. జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు వారి ఫొటోతలో కూడిన ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. కరుడుగట్టిన నేరస్తులు, క్రిమినల్ గ్యాంగ్ గోడ పత్రికను ప్రయాణికులు గుర్తించే విధంగా ప్రదర్శించామన్నారు. ఫొటోల్లో ఉండే వ్యక్తులు కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సంతవురిటిలో భూసర్వే



డ్రోన్ కెమెరాతో సర్వేకు సిద్ధమవుతున్న సిబ్బంది

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలో శుక్రవారం డ్రోన్ కెమెరా ద్వారా మీ భూమి.. మా హామీ పథకంలో భాగంగా సర్వే చేపట్టారు. నడిమివలస గ్రామంలో సుమారు రెండువేల ఎకరాల్లో భూ సర్వే చేసేందుకు కెమెరా ఏర్పాటు చేశారు. భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ హనుంతురావు పర్యవేక్షణలో సర్వే చేపట్టారు. పంచాయితీలో ఉన్న భూ సమస్యను పరిష్కారం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బుడారి లక్ష్మణరావు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పిల్లల శివకుమార్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, చందనాల రంగారావు, వీఆర్వో శ్రీనివాసరావు, సర్వేయర్ మొయ్యి ఈశ్వరరావు, పావని, పంచాయతీ కార్యదర్శి హిమబిందు ఉన్నారు.

పొలం గట్లపై కందిసాగు



చీమలవలసలో పొలం గట్టుపై సాగు చేస్తున్నకందిపంట

ఆమదాలవలస రూరల్: రైతులు కందిపంట సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. చీమలవలస, కొత్తవలస, తొగరాం, కొర్లకోట, దూసి, జీకేవలస, నిమ్మతొర్లాడ, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో పొలం గట్లపై కందిని సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఉచితంగా కంది విత్తనాలు సరఫరా చేయడంతో పాటుగా వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించడంతో ఎక్కువమంది పంటను పండిస్తున్నారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా సూరపునాయుడు

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గం బీజేపీ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన పేడాడ సూరపునాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానవర్గం నుంచి సమాచారం వచ్చిందని శుక్రవారం తెలియజేశారు.